చంద్రబాబు పాపం.. రైతులకు శాపం

- పురుషోత్తపట్నం రైతుల ఆవేదన
- ఇంకా వీడని టీడీపీ తప్పిదాలు

సీతానగరం: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పేరుతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కుందని, నష్ట పరిహారం విషయంలో మోసం చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ పాపం చంద్రబాబు నాయుడేదనని వ్యాఖ్యానించారు. ఇటీవల పురుషోత్తపట్నంలో ఆయన మాట్లాడిన తీరును తప్పుపడుతున్నారు. ఎత్తిపోతల పథకం పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములను లాకున్నది అప్పటి టీడీపీ ప్రభుత్వమేనన్నారు.

ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం

గోదావరి జలాలను తరలించి సాగు విస్తీర్ణం పెంచాలనే ఆలోచనతో పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలకు టీడీపీ ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. 2016లో పురుషోత్తపట్నం పనులు మొదలయ్యాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఎత్తిపోతల పథకాలు నిరుపయోగమవుతాయని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చెప్పినా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ జేబులు నింపుకోవడానికి పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నెలకొల్పింది. పురుషోత్తపట్నం పథకం ద్వారా విశాఖపట్నం వరకూ సాగు, తాగునీరు అందించాలనేది లక్ష్యమంటూ రూ.1900 కోట్లు పైబడి నిధులు మంజూరు చేసింది. పురుషోత్తపట్నం నుంచి పది కిలోమీటర్లు దూరంలోని గండికోట వద్ద పోలవరం ఎడమ కాలువలోకి పైపులైన్ కలిపి, ఏలేరు రిజర్వాయర్‌లోకి నీటిని పంపడానికి అధికారులు నిర్ణయించారు.



మూతపడిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం

బలవంతంగా భూసేకరణ

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ కోసం వంగలపూడి, పురుషోత్తపట్నం, చినకొండేపూడి, నాగంపల్లి రెవెన్యూ గ్రామాల్లో 334 మంది రైతులకు చెందిన 207 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, 244 మంది రైతులు ముందుగా భూమి అప్పగించారు. వీరికి ఎకరానికి రూ.24 లక్షల నుంచి రూ. 28 లక్షలు పరిహారంగా అందించారు. మిగిలిన 70 ఎకరాల భూమికి చెందిన 110 మంది రైతులు 2013 భూసేకరణ చట్టం అమలు చేసి, ఎకరానికి రూ.34 లక్షలు చెల్లించాలని డిమాండ్‌తో తమ భూములను అందించలేదు. దానితో పోలీస్ రక్షణతో రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకున్నారు. అయితే రైతులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించడంతో పర్యావరణ అనుమతులు లేకుండా నెలకొల్పారంటూ ఎన్జీటి అభిప్రాయపడింది. ఈ ఎత్తిపోతల పథకం లక్ష్యాన్ని చేరుకోకుండానే 2019లో మూతపడింది.

ఆ వ్యాఖ్యలపై ఆగ్రహం

సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా ఈనెల 8న పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన తరువాత పరిహారం తానే అందిస్తానని, వైఎస్సార్ సీపీ మోసంలో పడిపోయారని ఆరోపణలు చేయడంతో ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. బలవంతంగా భూములు తీసుకున్నది, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించకుండా మోసం చేసింది, లాఠీలతో రైతులను కొట్టించింది ఎవరు బాబూ అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బలవంతంగా తీసుకుంది



పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం 2016లో టీడీపీ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకుంది. 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం అందించాలని రైతులు కోరినా చంద్రబాబు పట్టించుకోలేదు. దానితో వారు కోర్టును ఆశ్రయించారు. ఈనెల 8న పురుషోత్తపట్నంలో చంద్రబాబు మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే. తిరిగి అధికారంలోకి వచ్చిన తక్షణమే పరిహారం అందిస్తామని చెప్పడం ఎంతో విడ్డూరంగా ఉంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

– వలవల వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సీతానగరం

చంద్రబాబు మాటలు హాస్యాస్పదం



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల పురుషోత్తపట్నంలో మాట్లాడిన మాటలను ప్రజలను నమ్మడం లేదు. ఆయన తన పంథాను మార్చుకుంటే బాగుంటుంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి కర్త, కర్మ అన్నీ తానే అయిఉండి కూడా, ఇప్పుడు ఏమీ ఎగనట్లు మాట్లాడుతున్నారు. వైఎస్ జగన్ మోసం చేశారంటూ ఆయన వ్యాఖ్యానించడం ఎంతో హాస్యాస్పదం. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారు.

– ఘంటా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల విస్తరణ పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సంబంధిత అధికారులకు సూచించారు. ముగ్గళ్ల, రఘుదేవపురం మధ్యలో జరుగుతున్న కాంక్రీట్ లేయర్ల పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులను ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిరంతరం సంబంధిత రోడ్లు భవనాలశాఖ అధికారులు, కాంట్రాక్టర్లుతో పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.

మహాభారతం మార్గదర్శకం

రాజానగరం: తెలుగు సాహిత్యానికి మహాభారతం వజ్ఞ పంతిలా ఉపయోగపడుతుందని తెలుగు సంస్కృత పండితులు బేతవోలు రామబ్రహ్మం అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. చిన్నప్పుడు కాపీ రైటింగ్ అని ఉండేది, కాపీ బుక్‌లో పైన ఉన్న వాక్యం ఉండేది, దాన్ని చూసి మనం రాసేవారం. దానిని వజ్ఞ పంతి అనేవారు, వజ్ఞ అంటే గురువు. అలాగే నన్నయ రచించిన మహాభారతం ఆయన తరువాత తరాల రచయితలందరికీ వజ్ఞ పంతిలా ఉపయోగపడుతోందన్నారు.

క్లుప్తంగా

రైతులకు సంపూర్ణ సహకారం

మధురపూడి: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సంపూర్ణ సహకారం అందించాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుష్కర కాలువలో గుర్రపు డెక్కను తొలగించాలని, నిరంతరం కాలువను శుభ్రం చేయాలన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

అనపర్తి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ లైన్‌లో చెట్టు కొమ్మల తొలిగింపు నిమిత్తం 18వ తేదీ శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ స్థానిక ఇందిరా నగర్, మార్కండేపురం, మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్, శేషగిరిరావుపేట, కెనాల్ రోడ్డు ప్రాంతాలతో పాటు మండలంలోని కొప్పవరం, లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకూ అనపర్తి పాతవూరు ధరణికోట, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతాల పరిధిలో సరఫరా నిలిపివేయనున్నామని అన్నారు.

వసతులు కల్పించండి

రంగంపేట: తమ నివాసాలకు పట్టాలు మంజూరు చేసి డ్రైనేజీ, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించాలని కోరుతూ సింగంపల్లి సీపీ రెడ్డి కాలనీ వాసులు ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ చాలా కాలంగా సీపీ రెడ్డి కాలనీలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

అనపర్తి: స్థానిక గాంధీనగర్ బుల్లియ్యగారి తోటలో శ్రీకాంప్లెక్స్ వద్ద వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగణపతి సహిత ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయం ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకుడు రామం ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.. ఆలయ కమిటీ ప్రతినిధులు మేడపాటి చెల్లారెడ్డి, మార్శెల్ల గంగరాజుశర్మ, తేతల త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం



మర్రిపూడిలో అమృత్ మహోత్సవ్ ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రంగంపేట: మర్రిపూడి గ్రామంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమిని కాపాడుకుందామని, అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. స్థానిక చెరువు గట్టుపై 75 కొబ్బరి మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ మేడిది చక్రం, మండల సాగునీటి సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారం ఎనలేనిది

పెదపూడి: విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాకూర్తి త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఆ పాఠశాలలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు యెరుబండి శ్రీరామచంద్రమూర్తి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సలాది విమల, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా రామయ్యన్న, ఇతర ప్రజాప్రతినిధులు తిబిరిశెట్టి ఆదినారాయణ, అద్దంకి బాబులు, అద్దంకి భద్రం, వీరబాబు, నాగిరెడ్డి భాస్కరరావు, అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, సంపర అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సంపర అసోసియేషన్ సౌజన్యంతో మల్లిపూడి రామకృష్ణ రూ.25 వేల మైక్‌సెట్, నాగిరెడ్డి భాస్కరరావు రూ.20 వేల ప్రింటర్, ఎస్‌ఈఏ సంస్థ వారిచే 40 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు, తెమ్మనబోయిన వీర్రాజు, మల్లిపూడి శ్రీనివాసరావు రూ.50 వేల విలువైన మొక్కలు, అద్దంకి దొరబాబు విద్యార్థులకు తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు రూ.36 వేలు, అద్దంకి శ్రీరామచంద్రమూర్తి ఆయన కుమారుడు వెంకటరామారావు విద్యార్థులకు రూ.20 వేల విలువైన నగదు ప్రోత్సాహకాలు అందించారు. అలాగే కొమరిపాలేనికి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డి, సత్తిరెడ్డి పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. మరో 8 మంది దాతలు రూ.20 వేలను ఇచ్చారు.

భోజనం ప్లేట్ల వితరణ

మధురపూడి: గాడాలలోని హైస్కూల్ విద్యార్థులకు బుధవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలో విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న టి.శిరీష వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మలాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, మడికి గంగాధర్, పార్టీ ఎస్సీసెల్ మండల కన్వీనర్ పైడిమల్ల ధనరాజ్ పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చేందుకే పథకాలు



జి.మామిడాడలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజల కష్టాలు తీర్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సమస్యలను విని తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో జగనన్న ప్రజల కష్టాలను తెలుసుకుని ప్రస్తుతం చిత్తశుద్ధితో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏ గడపకు వెళ్లినా సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ఇంటి ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, నియోజకవర్గ గ్రామ పంచాయతీ విభాగం అధ్యక్షుడు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాపాకలో గడప గడపకూ..

సీతానగరం: సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాపాకలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రాపాక గ్రామాభివృద్ధికి రూ.20 లక్షలు మాత్రమే ఖర్చు చేస్తే, నేడు అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాపాకలో రూ. 2.95 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అందులో భాగంగా గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలల నిర్మాణ చేపట్టామన్నారు. ఈ గ్రామంలో గడప గడపకూ పూర్తయిన తర్వాత సమస్యలన్నింటినీ సంబంధిత అధికారులతో కలిసి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ 2 సత్యం మదన్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పిచ్చుకల రవికుమార్, పిచ్చుకల విజయ్ కుమార్, రావూరి రామరాజు, ఏగుబంటి సత్తిబాబు, ఎస్సీసెల్ నాయకులు అంబటి రాజు, అంబటి రమణ పాల్గొన్నారు.



రాపాకలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

‘ఫ్యామిలీ డాక్టర్’తో మెరుగైన వైద్య సేవలు

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక సంజీవయ్య నగర్‌లో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యక్రమాన్ని పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఏఎన్‌ఎం కె.బేబిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ, పార్టీ నాయకులు తోలేటి రాంప్రసాద్, బొడ్డపాటి వీరచంద్రం, నండూరి బుజ్జి, హెచ్‌వీ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట మండలంలో..

రంగంపేట: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 104 వాహన వైద్యాధికారి సమీర్‌కుమార్ కోరారు. వెంకటాపురం, సుభద్రంపేట గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రోగులు, గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో నడవలేని, మంచాన పడిన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఏఎన్‌ఎం బేబిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



విద్యార్థుల ప్రదర్శనలు



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాలులో కేంద్ర సాహిత్య అకాడమీ, నన్నయ వర్సిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు వక్తల ప్రసంగాలతో సాగిన కార్యక్రమం సాయంత్రం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తిపోయింది. మహాభారతంలోని వివిధ ఘట్టాలతో కూడిన ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. కేరింతలు, చప్పట్ల ధ్వనులతో కన్వెన్షన్ హాలు మారుమ్రోగింది.

బాలిక శస్త్రచికిత్సకు సాయం

అనపర్తి: ఓ బాలిక కాలికి శస్త్రచికిత్స నిమిత్తం బుధవారం సాయం అందించినట్లు పద్మశాలి సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు, యువసేన సభ్యుడు పెనుగొండ శ్రీనివాసరావు తెలిపారు. రాయవరం మండలం మాచవరానికి చెందిన కట్టా ప్రభావతి పడిపోవడంతో ఆమె కాలు మూడు చోట్ల విరిగింది. చిన్నతనంలోనే ఆమె తండ్రి మరణించడంతో తల్లి సుశీల కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న పద్మశాలీ యువసేన సభ్యులు రూ. 28 వేల ఆర్థిక సాయం చేశారు. సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హామీ ఇచ్చారని యువసేన ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో తేలు శ్రీను, ఏలూరి శ్రీనివాసరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



సుశీలకు సాయం అందజేస్తున్న పద్మశాలీ యువసేన సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు

ఉత్తమ సేవలకు పురస్కారం

అనపర్తి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు అనపర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్‌కు పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, ఎస్సై పి.అప్పారావు, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.



మంత్రి వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సీఐ శ్రీనివాస్

సీఎం జగన్ నిర్ణయం హర్షణీయం

రాజానగరం: రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న చిరుద్యోగులకు మేలు చేకూరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల ఫెడరేషన్ జోనల్ కన్వీనర్ డాక్టర్ వౌలుపు కనకరాజు అన్నారు. ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీని అనుసరించి, 2014 జూన్ 2 నాటికి నియమింపబడి, ఇప్పటికీ కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసేలా నిర్ణయం తీసుకుని, ఆ చిరుద్యోగుల కుటుంబాలకు స్వాతంత్ర్య దినోత్సవ కానుకను అందించారన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సీతానగరం: సీతానగరం, చినకొండేపూడి, వెదుళ్లపల్లిలో పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. సీతానగరంలో ఓసిరెడ్డి చిన్నారావు, బండారు అర్జునరావు, కోండ్రపు అక్కులమ్మ, ఆదిమల్లి మహాలక్ష్మి, పేపకాయల సూర్యనారాయణ, మాధవరపు లక్ష్మి, చినకొండేపూడిలో మేడిశెట్టి బుల్లిలక్ష్మి, వెదుళ్లపల్లిలో అడపా రాఘవ, ముసలపల్లి శ్రీను మృతి చెందారు. వారి కుటుంబాలను విజయలక్ష్మి ఓదార్చారు.

విద్యార్థుల ప్రతిభ

బిక్కవోలు: పందలపాక శ్రీపదాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన 6వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ బాలుర షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించిందని పీడీ ద్వారాపూడి యువరాజారెడ్డి తెలిపారు. బుధవారం ఆ పాఠశాలలో విజేతలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, హెచ్‌ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు అభినందించారు. క్రీడాకారులు మలక అవినాష్, పోతురాజు బాలచైతన్య, చిలకపాటి గౌతమ్ రామ్‌చరణ్, వేమవరపు దీపక్, సున్న అఖిలాష్, పోతు గగన్‌లను అభినందించారు. ఉపాధ్యాయులు టి.జయకృష్ణారెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, సప్ప శ్రీనివాసు పాల్గొన్నారు.



పందలపాకలో క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కులవృత్తులకు అన్నివిధాలా ప్రాధాన్యం

సీతానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని కులవృత్తులకూ ప్రాధాన్యం లభిస్తోందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సీతానగరంలోని బ్రహ్మం స్వామి వారి ఆలయ ఆవరణలో బుధవారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బలగం వీరభద్రం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతున్నాయన్నారు. కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, చల్లమళ్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

